క్లుప్తంగా

భగవద్గీతలో ప్రతీ సమస్యకు పరిష్కారం



ప్రవచనాలు చెబుతున్న అన్నపూర్ణమ్మ

సారవకోట: జీవితంలో మానవుడు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు భగవద్గీతలో పరిష్కారం ఉంటుందని విజయనగరానికి చెందిన ప్రవచనకర్త అన్నపూర్ణమ్మ అన్నారు. ఆదివారం పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని కిన్నెరవాడలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో గో పూజ చేశారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలన్నారు. గ్రామస్తుల ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ చేపట్టారు. బోయిన వెంకటరమణ, రామదాసు తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో కాళింగ సంక్షేమ సంఘంభవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు సంఘం ప్రతినిధులు ఉప్పాడ పూర్ణారావు, శ్రీనివాసరావు, శ్రీరామమూర్తి కోరారు. మబగాంలోని ఎమ్మెల్యే ఇంటికి ఆదివారం వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పూర్ణారావు తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి, కాళింగ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కవిత

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన పోతురాజు వెంకటప్పడు అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు వృద్ధాప్య పింఛన్‌ను గ్రామ వలంటీర్ నెమలపురి కవిత ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. వలంటీర్‌కు జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఆదివాసీ చైతన్య వేదిక మండల కమిటీ ఎన్నిక



సవర సింహాచలం

కొత్తూరు: ఆదివాసీ చైతన్య వేదిక కొత్తూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలంలోని మెట్టూరు గూడ వద్ద ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిటీ మండల అధ్యక్షుడిగా సవర సింహాచలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ జిల్లా అధ్యక్షుడు సవర చొక్కారావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సవర మహేష్, కార్యదర్శిగా సవర సురేష్‌తోపాటు కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. కొత్తూరు మండలానికి చెందిన సవర రమేష్, ఉపాధ్యాయులు జన్ని చిన్నయ్య, కె.దండాసి, రామారావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న, అప్పారావు, శివ, దుర్గారావు, పలువురు గిరిజన నాయకులు, మెళియాపుట్టి మండల సహాయ కార్యదర్శి సవర కూర్మారావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మజ్జిలిపేట



విజేతలకు కప్, నగదు బహుమతి అందజేస్తున్న సువ్వారి గాంధీ

పొందూరు: మండలంలోని యాగాటిపేటలో నిర్వహించిన మండల స్థాయి ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్‌లో విజేతలకు కప్, నగదు బహుమతిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ ఆదివారం అందజేశారు. మండలంలోని 64 జట్లు పాల్గొన్నాయి. మజ్జిలిపేట జట్టు మొదటి స్థానం, దళ్లవలస జట్టు రెండో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా కప్, రూ. 0 వేలు నగదు, ద్వితీయ బహుమతిగా షీల్డ్, రూ.5 వేల నగదును అందజేశారు. ఎంపీటీసీ పెయ్యల సరస్వతి, వైస్ సర్పంచ్ చింతాడ పావని, మాజీ ఎంపీటీసీ కోరుకొండ సాయికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం

● నేలరాలిన మామిడి కాయలు



ఎల్.ఎన్.పేట: జంబాడ వద్ద గాలులకు రాలిపోయిన మామిడి కాయలు

ఎల్.ఎన్.పేట: ఎండ తీవ్రత, వేడి గాలుల నుంచి ఉపశమనం లభించింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతోపాటు భారీగా వర్షం కురిసింది. బలమైన గాలుకు మామిడి రైతుకు నష్టం జరిగింది. మండలంలోని జంబాడ, కరకవలస, సరడాం, బొత్తాడసింగి, దబ్బపాడు, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట తదితర గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయని తోటల కాపలాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు వేసుకునేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

భయపెట్టిన గాలులు..

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. కొద్ది సమయం గాలులు ఆందోళన కలిగించాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

బూర్జలో..

బూర్జ: మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం సాయంత్రం కురిసింది. వాతావరణం చల్లబడింది. మామిడి పంటకు నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మామిడి కాయలు నేలరాలడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. ఇంటిపై రేకులు చెల్లాచెదరయ్యాయి. గాలులతోపాటు వర్షం కురిసింది. రోజంతా తీవ్రమైన ఎండతో ఉక్కిబిక్కిబిక్కరి అయిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది.

హిరమండలంలో..

హిరమండలం: గత కొన్నిరోజులుగా భానుడు ప్రతాపానికి మండల ప్రజలు అల్లాడిపోయారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షంతో ఉపశమనం కలిగింది.



ఎల్.ఎన్.పేట: కుండపోతగా కురుస్తున్న వర్షం



బూర్జ: దొంకలపర్త వద్ద ఈదురుగాలులతో కూడిన వర్షం



హిరమండలం: హిరమండలంలో కురుస్తున్న వర్షం

20వ పర్తి యాత్ర విజయవంతం చేయాలి

● సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు



మాట్లాడుతున్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు

పాతపట్నం: ఆగస్టు 19, 20, 21వ తేదీల్లో పుట్టపర్తిలో జరగనున్న 20వ పర్తియాత్రకు జిల్లా సత్యసేవా సమితి సంస్థల ప్రతినిధులు బయలుదేరాలని సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎన్ని లింగరాజు అన్నారు. పాతపట్నంలోని సత్యసాయి సేవా సమితి మందిరంలో 20వ పర్తియాత్ర జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ పర్తి యాత్రను జిల్లాలోని అన్ని సేవా సంఘాలు, సమితులు, భజన మండలి, మందిరాల సంఘాలు, కళాకండాల ప్రతినిధులు బయలుదేరి విజయవంతం చేయాలన్నారు. కళా కండాలతో నృత్యప్రదర్శనలు చేసి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కన్వీనర్ నాగులపల్లి శ్రీనివాసరావు, జి.రమణబాబు, సత్యనారాయణ, గుప్త, జిల్లాలోని సత్యసేవా సంస్థల ప్రతినిధులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.

నేడు జల్‌జీవన్ మిషన్ ప్రారంభం

ఆమదాలవలస రూరల్: మండలంలో తాళ్లవలస, మండాది, ఈసర్లపేట గ్రామాల్లో సోమవారం ఉదయం 10.30 గంటలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించనున్నారు. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పోలాకి: ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 11వ తేదీన 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రన్సిపాల్ పి.ప్రవీణ ఆదివారం తెలిపారు. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల అధ్యక్షురాలు తూలుగు మేనక అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ బి.శైలజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో ఆదివారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు పాతపట్నం సంఘ సంపర్క్ ప్రముఖ్ అప్పలరాజు హాజరై హిందూ సామ్రాజ్య దినోత్సవం ఎందుకు నిర్వహిస్తారో తెలియజేశారు. హిందూ ధర్మాన్ని కాపాడాలన్నారు. హనుమాన్ భక్త సమాజం సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నేత్రోన్యాసం



సారవకోట: నేత్రోన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని అవలింగి గల జగన్నాథ స్వామి ఆలయంలో స్వామి వారి నేత్రోన్యాస కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 15 రోజుల తరువాత రానున్న రథా యాత్రను పురస్కరించుకుని జ్యేష్ఠ పౌర్ణమి నాడు స్వామి వారి నేత్రోన్యాస కార్యక్రమం ప్రతిఏటా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: జగన్నాథస్వామి నేత్రోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా జగన్నాథుని నేత్రోత్సవం

హిరమండలం: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద గల జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు సురేష్ పాడి, శ్రీను పాడీ స్వామి వారికి శాస్త్రోకత్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్నాథస్వామి (నేత్రోత్సవం)కళ్లను పుణ్యజలాలతో శుద్ధిచేసి అభిషేకించారు. రథా యాత్ర తొలిఘట్టంగా స్వామివారిని నూతన వస్త్రాలతో అలంకరించారు. స్వామివారు 15 రోజుల పాటు చీకటి గదిలో విశ్రాంతి తీసుకుంటారని, మరళా తరిగి ఈ నెల 20న నిర్వహించే రథా యాత్ర ప్రారంభం రోజున భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● ఆత్మీయ కలయిక



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని బైదలాపురం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆదివాసీ భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆనాటి గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

పాతపట్నం:

మండలంలోని శోభ పంచాయతీ కొమ్మలగూడ గ్రామంలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులు ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన రైతులు ఎద్దులను అలంకరించి, పూజలు చేసి పొలాల్లో నాగలితో దుక్కి దున్ని పనులు ప్రారంభించారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని పూజించారు. సర్పంచ్ ఆనంద్, సీపీఎఫ్ అధికారి సంతోష్, నిహారిక, శాంతిప్రియ, అప్పారావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



ఏరువాక నిర్వహిస్తున్న రైతులు

నేడు కోడూరు సచివాలయం ప్రారంభం

పోలాకి: మండలంలోని కోడూరు సచివాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సచివాలయ భవనాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం పిన్నింటిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది హాజరుకావాలని కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



ధ్రువపత్రాలు అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలసకు చెందిన సిక్కోలు చేయూత సేవా సంఘం ఆధ్వర్యంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ వారు ఆదివారం స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు, సంఘం సభ్యులు 32 యూనిట్ల రక్తం దానం చేశారు. అపదలో ఉన్నవారికి ఈ రక్తం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తం దానం చేయాలని పిలుపునిచ్చారు. బ్లడ్ బ్యాంక్ సిబ్బందితోపాటు సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.గోపికృష్ణ, వి.టి.నాయుడు, గౌరవ సభ్యులు రమేష్, కె.వి.ఎన్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, గుడ్ల బాబు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సీతారంపల్లిలో సర్పంచ్ ధర్మాన కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి ఎంపీటీసీ దువ్వారి జోగారావు తండ్రి వనజనాభం ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పెద్దలోడిగిలోని జోగారావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే సీతారంపల్లి సర్పంచ్ ధర్మాన కుమార్‌రెడ్డి తండ్రి బైరాగి ఇటీవల మృతి చెందారు. కుమార్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. పాతపట్నం మేజర్ పంచాయతీ మొండిగలవీధికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకాల అచ్చెయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

అచ్చెయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. పాతపట్నం మార్కెట్ వీధికి చెందిన కనకాల బైరాగి కుమారుడు కనకాల రామారావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, పెద్దలోడిగి సర్పంచ్ డకర చిన్నారావు, జి.రాము, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: మండల కేంద్రంలోని సీతారామాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా చేపట్టారు. కొత్తూరుకు చెందిన బగళ ప్రసాద్ పండా వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం ప్రొగ్రామ్ ఆఫీసర్ లలిత మణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు, హెచ్‌డీపీపీ మండల కన్వీనర్ పొగిరి రవి, జి.మన్మథరావు, పెద్దిన విశ్వనాథం, లంకవలస రమణయ్య, ప్రసాదరావు, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మణ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

170 మందికి నేత్ర పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు భారతి

ఆమదాలవలస రూరల్: నేత్రాలను ప్రతీఒక్కరూ సంరక్షించుకోవాలని కంటి వైద్యాధికారి బి.భారతి అన్నారు. మండలంలో కొత్తవలస గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలు రాకుండా ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విటమిన్–ఏ కలిగి ఉన్న పౌష్టికాహారాన్ని అధికంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ గురుగుబెల్లి వెంకటప్పలనాయుడు, ఎంపీటీసీ కూటికుప్పల సన్యాసిరావు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం అభినందనీయం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆమదాలవలస: కళలను ప్రోత్సహించడం అభినందనీయమని, ఎంతోమంది నూతన కళాకారులను తయారు చేయడానికి నాట్యశ్రీ నృత్య కళానికేతన్ చేస్తున్న కృషి గొప్పదని మానవ హక్కుల కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బాడాన దేవభూషణరావు అన్నారు. నాట్యశ్రీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన వేసవి నృత్యశిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొటేరియన్ జె.కె.వెంకుబాబు మాట్లాడుతూ కళలను ప్రోత్సహిస్తున్న సంస్థ డైరెక్టర్ కూన శ్రీలతను అభినందించారు. చిన్నారులకు కవాల్సిన దుస్తులు సమకూర్చడానికి సహకరిస్తానన్నారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సభకు అధ్యక్షుడిగా సామాజికవేత్త మందపల్లి రామకృష్ణ వ్యవహరించారు. రొటేరియన్ డాక్టర్ పి.తాతయ్యలు, కె.సంజీవిరావు, బి.గోపాలరావు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి

కొత్తూరు: అమృత్ సరోవర్ నిధులతో కొత్తూరు పంచాయతీ పరిధిలోని ముగితివాని చెరువును అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ పడాల కృష్ణవేణి ఆదివారం తెలిపారు. ఇప్పటికే చెరువు పనులు వేగవంతం చేశామన్నారు. చెరువు నుంచి సాగు నీరు ఆయకట్టు భూములకు ఇవ్వడంతోపాటు చెరువును ఆహ్లాదకరంగా మార్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు అవసరమైతే సొంత నిధులతోనైనా చెరువును పార్కులా తయారు చేస్తామన్నారు. చెరువు చుట్టూ బెంచీలు ఏర్పాటు చేసి, మొక్కలు పెంపకం వంటి వాటిని ప్రజలు విరాళాలుగా ఇస్తే వారి పేరున పెడతామన్నారు. హడ్డుబంగి–నివగాం రోడ్డు పక్కన ఉన్నందున చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.